క్లుప్తంగా

సర్కిల్-15కి నూతన ఏసీపీ

ముషీరాబాద్: జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 టౌన్ ప్లానింగ్ ఏసీపీగా ఉన్న మంజులాసింగ్ సికింద్రాబాద్ జోనల్ కార్యాలయానికి బదిలీఅయ్యారు. ఆమె స్థానంలో ఖైరతాబాద్ సర్కిల్‌లో ఏసీపీగా పనిచేస్తున్న రమేష్ ముషీరాబాద్ సర్కిల్-15కి నూతన ఏసీపీగా వచ్చారు.

జంగమ సమాజం అభివృద్ధికి కృషి


సరిత

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలో నివసిస్తున్న జంగమ సమాజం అభివృద్ధికి తగిన ప్రణాళికతో అభివృద్ధికి కృషి చేస్తానని జంగమ సమాజం గ్రేటర్ నాయకురాలు జి.సరిత అన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను జంగమ సమాజం సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యారంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పేద విద్యార్థులను ప్రోత్సహించేలా ప్రతిభా పురస్కారాలను అందజేస్తామన్నారు. వేద విద్యపై ఆసక్తి కలిగిన వారికి సాయం చేస్తామన్నారు. మహిళలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రభుత్వం ద్వారా రుణాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఈనెల 30న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగనున్న జంగమ సమాజం ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని తమ ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంతాపం

ముషీరాబాద్: నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బాకారం ధర్మచరణ సమితి అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ తల్లి అమృత బాయి బుధవారం ఉదయం మృతి చెందారు. ఆమె మృతిపై సికింద్రాబాద్ మాజీ ఎంపీ, ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్ అనిల్‌కుమార్ నివాసానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి నివాళులర్పించారు. రాంనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనా యాదవ్, మేడి సురేష్, అంజియాదవ్ తదితరులున్నారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌లో 'జనతా ఖానా'



కాచిగూడ: రైల్వే ప్రయాణికులకు రూ. 15కే జనతా ఖానాను అందించేందుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో జనతా ఖానా స్టాల్‌ను ప్రారంభించారు. జనతా ఖానాలో రూ. 7కే పూరీ, కూర, చట్నీ, మిర్చి ఉంటుందని వివరించారు. ప్రయాణికులకు ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వకుండా చోద్యం'

అంబర్‌పేట: డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా చోద్యం చూస్తుందని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు ధ్వజమెత్తారు. పేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లుగా మోసం చేస్తోందని ధ్వజమెత్తారు. బుధవారం గోల్నాక డివిజన్‌లో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన కలిశారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పేరిట పేదలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ నాయకులు రవీందర్‌గౌడ్, శ్యామ్‌రాజ్, నర్సింగ్‌రావుయాదవ్, రమేష్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జనగణనను వెంటనే చేపట్టాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం బీసీ జనగణన చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని వెంటనే బీసీగణన చేపట్టి వారికి తగిన న్యాయం చేకూర్చాలని రాష్ట్రీయ పిచ్‌డావర్గ్ మోర్చా(ఆర్‌పీవీఎం) జాతీయ అధ్యక్షులు చౌదరి వికాస్ పటేల్ డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆర్‌పీవీఎం, నేషనల్ ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బీసీ కులాలకు మొదటిసారిగా 1902 జూలై 26న ఛత్రపతి రాజర్షియ సాహూ మహరాజ్ దేశ చరిత్రలో కోల్హాపూర్ రాజ్యంలో రిజర్వేషన్లు అమలు చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. పూలే, సాహు, అంబేడ్కర్, పేరియార్‌ల స్ఫూర్తితో బీసీల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాసురామ్‌నాయక్, వైహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ప్రభాకర్, వివిధ సంఘాల నాయకులు దశరథ్, దేవరాజ్‌గౌడ్, ప్రసాద్‌గౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

పోలింగ్ కేంద్రాల మార్పుపై సమీక్ష

- ముషీరాబాద్‌లో 103 పోలింగ్ కేంద్రాలు
- గతంలో పలు పోలింగ్ కేంద్రాలు మార్పు
- రెండు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు


సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

ముషీరాబాద్: నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలను వివిధ రాజకీయ పార్టీల సమావేశంలో దాదాపు ఖరారు చేశారు. గతంలో 104 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 103కు చేరినట్లు తెలుస్తోంది. రెండు పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు తలెత్తడంతో గురువారం డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ తిప్పర్తి యాదయ్య రివెరిఫికేషన్ చేసి వాటిపై నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

మార్పులు చేర్పులు..

- అడిక్‌మెట్‌లోని జ్యోతి బాలమందిర్ స్కూల్ శిథిలావస్థకు చేరడంతో జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేసింది. దీంతో ఆ పాఠశాలను మూసివేశారు. ఇందులో ఉన్న 256, 257, 262, 263, 264, 265 పోలింగ్ బూత్‌లను పక్కనే ఉన్న ఎస్‌వీఈఎస్‌లోకి మార్చారు.
- గాంధీనగర్ డివిజన్‌లోని విద్యాదీప్ హైస్కూల్ అడ్రస్ 1-1-650/22 నుంచి 1-1-650/16కు మారింది.
- ఈ పాఠశాలలో ఉన్న 38, 39 పోలింగ్ బూత్‌ల చిరునామాలు కూడా మారాయనే విషయం ఓటర్లు దృష్టిలో ఉంచుకోవాలని కోరారు.
- లోయర్ ట్యాంక్‌బండ్‌లోని ఏపీ తెలగ, కాపు, బలిజ సంఘం భవనంలో ఉన్న 63, 64 బూత్‌లను సమీపంలోని రజక కాలనీలో జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్‌లోకి మార్చారు.
- కవాడిగూడ డివిజన్ క్రేమ్‌బ్రిడ్జి గ్రామర్ హైస్కూల్‌లో 72, 73 పోలింగ్ బూత్‌లను పక్కనే ఉన్న లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లోకి మార్చారు.

నేడు రీవెరిఫికేషన్..

పార్టీ ప్రతినిధుల నుంచి వచ్చిన రెండు పోలింగ్ కేంద్రాల అభ్యంతరాలపై డీఎంసీ, నియోజకవర్గ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి తిప్పర్తి యాదయ్య గురువారం అడిక్‌మెట్, ముషీరాబాద్‌లోని రెండు కేంద్రాలను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

- నియోజకవర్గంలో పోలింగ్ బూత్ కేంద్రాల సంఖ్య దాదాపు ఖరారైనట్లే కనిపిస్తోంది. ఎలక్షన్స్ సూపరెంటెండ్ భీమ్‌రావ్, క్లర్క్స్ లక్ష్మణ్‌రావు, బీఆర్‌ఎస్ నుంచి కె.మాధవ్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, కాంగ్రెస్ పార్టీ నుంచి మాజీ కార్పొరేటర్ వాజీద్‌హుస్సేన్, బీజేపీ నుంచి అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, టీడీపీ నుంచి చంద్రమోహన్‌గౌడ్, సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, ఆప్, ఎంఐఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

- దాయర మార్కెట్‌లోని వెస్లీ కేజీ అండ్ ప్రైమరీ స్కూల్లో ఉన్న 152, 153, 154, 155, 156 వరకు ఉన్న ఐదు పోలింగ్ బూత్‌లను సున్నం బట్టి దగ్గర గల సెయింట్ లూయిస్ పాఠశాలకు మార్చారు.
- ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని జిల్లా పరిశ్రమల అభివృద్ధి శాఖ ఆవరణలో 168, 169, 170 పోలింగ్ బూత్‌లను ముషీరాబాద్ ఐటీఐలోకి మార్చారు.
- జెమిని కాలనీలోని జిల్లా గ్రంథాలయంలో ఉన్న 175, 176 పోలింగ్‌బూత్‌లను సమీపంలోని రెడ్ కాన్వెంట్ ప్రైమరీ స్కూల్‌లోకి మార్చారు.

రెండు కేంద్రాలపై అభ్యంతరాలు..

- జ్యోతి బాలమందిర్ పాఠశాలలో ఉన్న ఆరు పోలింగ్ బూత్‌లను ఎస్‌ఈవీఎస్‌లోకి మార్చడంపై బీఆర్‌ఎస్ నాయకులు కొండపల్లి మాధవ్ అభ్యంతరం వ్యక్తం చేశారు.
- ఇప్పటికే ఎస్‌ఈవీఎస్‌లో పలు పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వీటిని అడిక్‌మెట్ కమ్యూనిటీహాల్, వడ్డెర బస్తీలోని కోపుగుంత అంగన్‌వాడీ సెంటర్‌లోకి మార్చాలని కోరారు.
- ముషీరాబాద్ గంగపుత్ర సంఘంలో ఉన్న 98, 99 పోలింగ్ బూత్‌లను బహదూర్‌యార్ జంగ్‌లోని మహిళా డిగ్రీ కళాశాలలోకి మార్చాలన్నారు.

నాలాల్లో సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు


అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: నియోజకవర్గంలో నాలా పరిసరాల్లో సమస్యలు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. బుధవారం నియోజకవర్గంలోని బతుకమ్మకుంట, శివం రోడ్డు పరిసరాల్లో ఉన్న జీహెచ్‌ఎంసీ నాలా ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. కురుస్తున్న వర్షాలతో పొంగిపొర్లుతున్న నాలాలు, డ్రైనేజీతో ప్రజలు అవస్థలు పడుతారని అవి తలెత్తకుండా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలు సైతం పరిసరాల పరిశుభ్రతను పాటించాలని కోరారు. అనంతరం సీఈ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై కాలనీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులతో పాటు కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫీవర్‌కు రోగుల తాకిడి

- వాతావరణ మార్పు, పారిశుద్ధ్య లోపం
- అధికంగా జలుబు, జ్వరాల కేసులు
- రోజుకు 250 నుంచి 400ల ఓపీ


రక్త పరీక్షకు శాంపిల్ సేకరిస్తున్న ల్యాబ్ సిబ్బంది (ఫైల్)

నల్లకుంట: వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు పలు రకాలైన సీజనల్ వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రితో పాటు బస్తీ దవాఖానాలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. జ్వరాలతో పాటు డయేరియా బారినపడిన రోగులు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స తీసుకుంటున్నారు. - స్థానిక ఫీవర్ ఆసుపత్రిలో రోజుకు సుమారు 250 నుంచి 400 వందల వరకు రోగులు వివిధ వ్యాధులతో ఔట్‌పేషెంట్ విభాగంలో చికిత్సల కోసం వస్తున్నారు. వారిలో అధిక శాతం జలుబు, జ్వరాలతో వస్తున్నారని ఆసుపత్రి వైద్యులు చెబుతున్నారు.

- బస్తీ దవాఖానాలు, ప్రైవేటు ఆసుపత్రుల్లో రోజుకు వందల సంఖ్యలో రోగుల తాకిడి పెరుగుతోందని సమాచారం.
- గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఫలితంగా వ్యాధులు ప్రబలే అవకాశం అధికంగా ఉంది.
- ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు ప్రత్యేక పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రోగులు పెరిగారు..



ఇటీవల సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు, ఇతర క్రిమి కీటకాల వృద్ధి పెరుగుతోంది. ఎక్కువగా జలుబు, జ్వరాల కేసులు వస్తున్నాయి. కాచి చల్లార్చిన నీరు సేవించడం వల్ల చాలా వరకు మంచిది. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనేక రకాల రోగాల నుంచి విముక్తి పొందవచ్చు.

– డా కె. శంకర్, ఫీవర్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ఐఏఎస్ కోచింగ్‌కు స్కాలర్‌షిప్ పరీక్ష

చిక్కడపల్లి: ఐఏఎస్, ఐఆర్‌ఎస్ వంటి సర్వీసుల సాధనే లక్ష్యంగా ఉన్న విద్యార్థులకు హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని శరత్‌చంద్ర ఐఏఎస్ అకాడమీ నుంచి అవకాశాన్ని కల్పిస్తోందని అకాడమీ డైరెక్టర్ శరత్ చంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. అకాడమీ నిర్వహించే స్కాలర్ షిప్ పరీక్షరాసే మెరుగైన మార్కులు సాధించిన అభ్యర్థుల్లో ముగ్గురికి ఉచితంగా కోచింగ్, మిగిలిన వారికి 50 శాతం స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇతర ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు కూడా ప్రత్యేక స్కాలర్‌షిప్ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. సివిల్స్ ఆసక్తి ఉన్న విద్యార్థులకు చేయూతను అందిస్తామన్నారు. ఈ నెల 30న శనివారం ఉదయం 10 గంటలకు అశోక్‌నగర్‌లోని తమ ఇనిస్టిట్యూట్‌లో పరీక్ష జరుగుతుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పరీక్ష అనంతరం అవగాహన సదస్సు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సులో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు విద్యార్థులకు సలహాలు, సూచనలు అందిస్తారన్నారు. సెల్ నెంబర్ 9434188688ను సంప్రదించాలని కోరారు.

అంబర్‌పేట్ బీసీ జాగృతి కన్వీనర్‌గా దిలీప్‌కుమార్


నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

నల్లకుంట: తెలంగాణ బీసీ జాగృతి అంబర్‌పేట్ నియోజకవర్గ కన్వీనర్‌గా గోల్నాక దుర్గానగర్‌కు చెందిన ఏనుగంటి దిలీప్‌కుమార్ నియమితులయ్యారు. బుధవారం నల్లకుంట రత్నానగర్‌లోని తెలంగాణ బీసీ జాగృతి కార్యాలయంలో జరిగిన సమావేశంలో బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కేపీ.మురళీకృష్ణ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దిలీప్‌కుమార్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాగృతి అధ్యక్షుడికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జాగృతి ప్రధాన కార్యదర్శి సుదర్శన్, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంగౌడ్, ఉపాధ్యక్షుడు రమేష్, మహేష్, కార్యదర్శి వేణుగోపాల్, లాలాగౌడ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


దోమల నివారణ కార్యక్రమంలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని వాటిని అరికట్టేందుకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. బుధవారం జీహెచ్‌ఎంసీ ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ మందులను చల్లించారు. వర్షాలతో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేస్తానని పేర్కొన్నారు. ఎంటమాలజీ విభాగం అధికారులున్నారు.

అంబర్‌పేట్‌లో..

కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా మందులు పంపిణీ చేశారు. ప్రజలకు ఉచితంగా మందులు అందజేసి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వర్షాలతో ఇబ్బంది పడకుండా చర్యలు


రత్నానగర్‌లో కార్పొరేటర్ అమృత, గౌతంరావు


వరదనీటిని తొలగింపజేస్తున్న దృశ్యం

నల్లకుంట: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు జీహెచ్‌ఎంసీ అధికారులను కోరారు. బుధవారం నల్లకుంట డివిజన్ పరిధిలోని హుస్సేన్ సాగర్ నాలా పరివాహక ప్రాంతాలైన రత్నానగర్ బస్తీలో స్థానిక కార్పొరేటర్ అమృతతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నాలా రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. వర్షాల కారణంగా బస్తీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలు, రిటైనింగ్ వాల్ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన వారిని కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

వరదనీటి తొలగింపు..

కాచిగూడ: రోడ్లపై నిలిచిన వరద నీటిని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్ జీహెచ్‌ఎంసీ సిబ్బందిని పిలిపించి తొలగింపజేశారు. వర్షపు నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన నాలాలో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నిలిచింది. దీంతో తొలగింపజేశామని కార్పొరేటర్ బుధవారం తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారుల నిర్లక్ష్యం సరికాదన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం.. కేసు నమోదు

అంబర్‌పేట: భర్త వేధింపులు తాళలేక పుట్టింటికి వచ్చిన భార్యపై భర్త హత్యాయత్నం చేసిన ఘటన అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతపూర్‌కు చెందిన రమణాచారికి గోల్నాకకు చెందిన జ్యోతి (32)తో 2012లో వివాహమైంది. అప్పటి నుంచి రమణాచారి ఎలాంటి పనిచేయకుండా భార్యను వేధిస్తూ వచ్చాడు. వీరికి ఇద్దరు సంతానం కాగా.. భర్త ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాకపోవడంతో ఆమె 6 నెలల క్రితం పుట్టింటికి వచ్చింది. ఈ నెల 24న భర్త అర్ధరాత్రి వచ్చి కత్తితో గొంతు కోసి పారిపోయాడు. కుటుంబ సభ్యులు హుటాహుటీన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిందని సమాచారం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

80 కోట్ల మందికి ఉచిత రేషన్


బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు కె.గీతామూర్తి, తదితరులు

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ 9 ఏళ్ల పరిపాలన పుస్తకాలను సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖులకు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అందజేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. గత 3 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వం దేశంలో గల దాదాపు 80 కోట్ల మందికి ఉచిత రేషన్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఇంత వరకు ఇలాంటి పథకం గత 70 ఏళ్లుగా దేశంలోని ఏ రాజకీయ పార్టీ చేపట్టలేదన్నారు. బీజేపీ నేతలు మీనాక్షి గిరిధారి, సినీ నటులు కేదార్ శంకర్, అప్పాజీ అంబరీష్, మధునందన్, సతీష్, రేవతీనాథ్, పుష్ప ఫేం కల్పలత, జయశ్రీ, రాజేశ్వరి, ప్రకాష్ త్యాగి, మధు త్యాగి, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూలే బాటలో సీఎం కేసీఆర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పది వేల మంది బీసీల పూర్తి రియంబర్స్‌మెంట్‌కు సీఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని ఎంబీసీ జాతీయ కన్వీనర్ సత్యనారాయణ అన్నారు. జ్యోతిబా పూలే బాటలో ఆయన నడుస్తున్నారని అభిప్రాయపడ్డారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలు దళిత, మైనార్టీ, గిరిజన విద్యార్థి, విద్యార్థినీలకు గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశంలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్, ఎస్సై నాగరాజు బుధవారం రాత్రి తెలిపిన కథనం ప్రకారం.. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని సుదర్శన్ థియేటర్ సమీపంలో శాంతిలక్ష్మి ఐఏఎస్ అకాడమీ ఎదురుగా ఉన్న ఫుట్‌పాత్‌పై 35, 40 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి పడి ఉన్నాడు. కాగా అటుగా వెళ్తున్న స్థానికులు చూసి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి పరీక్షించగా అతడు అప్పటికే చనిపోయాడని ధ్రువీకరించారు. మృతదేహాన్ని గాంధీమార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలి మృతి

అంబర్‌పేట: తెల్లవారుజామున టీ తాగేందుకు వెళ్తూ రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడం ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన బుధవారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రధాన రోడ్డు వినాయకనగర్ చౌరస్తాలో నివసించే సారంగ ముత్యాలమ్మ (80) తన కుటుంబంతో నివసిస్తోంది. ఆమెకు తెల్లవారుజామున టీ తాగే అలవాటు ఉంది. కాగా వినాయకనగర్ చౌరస్తాలో ఇంట్లో ఉన్న చెత్తను బయటపారవేసి టీ తాగేందుకు రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తల, కాలుకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. సీసీటీవీ కెమెరాల ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలి


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావుయాదవ్

కాచిగూడ: జనాభా ప్రాతిపదికన వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యాదవులకు అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు సీట్లు కేటాయించాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావు యాదవ్ అన్నారు. బుధవారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ.. యాదవులను నిర్లక్ష్యం చేసే పార్టీలకు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. యాదవుల సంక్షేమం, అభివృద్ధి కోసం యాదవ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 22 ఎమ్మెల్యే సీట్లు కేటాయించాలన్నారు. ఆగస్టు 13న యాదవ యుద్ధభేరిని నిర్వహించనున్నట్లు ప్రకటించారు. జనగణనలో కులగణన చేపట్టాలని కోరారు. అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, మేకల రాజేందర్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, మహేందర్‌యాదవ్, శ్రీహరి యాదవ్, రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలి


మాట్లాడుతున్న నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్

కాచిగూడ: రాష్ట్ర వ్యాప్తంగా 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లను హైకోర్టు తీర్పును గౌరవించి వెంటనే విధుల్లోకి తీసుకుని రెన్యూవల్ చేయాలని నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ సీహెచ్.కిషోర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. రెండు రోజుల్లో డిగ్రీ గెస్ట్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 23-24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామకానికి ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్ పై హైకోర్టు స్టే ఇస్తూ.. గతేడాది పనిచేసిన అతిథి అధ్యాపకులనే ఈసారి కొనసాగించాలని తీర్పును ఇచ్చిందన్నారు.
- త్రిసభ్య కమిటీ ద్వారా గతంలోనే అర్హత సాధించిన వారిని కాదని కమిషనర్ ఇచ్చిన కొత్త నోటిఫికేషన్‌ను సవాల్ చేస్తూ జి.శ్రీనివాస్, త్రిపాఠి వెంకట్‌రెడ్డి, జయరామ్ తదితర అతిథి అధ్యాపకుల ఆధ్వర్యంలో కోర్టును ఆశ్రయించామన్నారు. కోర్టు తీర్పును అనుసరించి త్వరగా ప్రొసిడింగ్స్ ఇవ్వాలని విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణను కలిసి కోరారు. సీఎం కేసీఆర్, ఉన్నత విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డిలకు విజ్ఞప్తి చేశారు

సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు


అధికారులతో కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: ప్రజా సమస్యల ఫిర్యాదులపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కారించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ. పావనీవినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని వార్డు 89వ కార్యాలయంలో ఆకస్మికంగా సందర్శించి ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌ద్వారా 80, నేరుగా వచ్చిన 9 ఫిర్యాదుల్లో 71 ఆన్‌లైన్ ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. నేరుగా వచ్చిన ఫిర్యాదులతో కలిపి ఇప్పటి వరకు 18 పెండింగ్‌లో ఉన్నాయని త్వరలో పరిష్కరించేందుకు కృషి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. భారీ వర్షాలతో కాలనీ, బస్తీ వాసులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకునేందుకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, వార్డు కార్యాలయం అధికారులు రిసెప్షనిస్ట్ శ్రీదేవి, వాటర్ వర్క్స్ సిబ్బంది మల్లేష్, శానిటేషన్ ఉద్యోగి బాల్‌రాజ్, ఎంటమాలజీ ఉద్యోగి అంజయ్య, యూసీడీ ఉద్యోగి గౌతమ్‌లు పాల్గొన్నారు.

ఎస్వీ రంగారావు స్మారక పురస్కారం


సత్కరిస్తున్న శ్రీనివాస్‌గుప్తా, వంశీ రామరాజు సురేందర్, పుష్పలత

చిక్కడపల్లి: తెలుగు ప్రజలకు ఆరాధ్య నటులు ఎస్వీ రంగారావు, నటి సౌందర్య అని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. బుధవారం త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళానిలయం నిర్వహణలో ఎస్వీ రంగారావు, సౌందర్యల జయంతి సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలనాటి బాలనటి బేబీ రాణిని ఎస్వీ రంగారావు స్మారక పురస్కారంతో సత్కరించారు. నాటి వారి ప్రతిభను నేటి తరాలకు పరిచయం చేసే కార్యక్రమాలు తరచూ జరగాలన్నారు. ప్రముఖ గాయని హైమావతి భీమన్న అధ్యక్షత వహించిన సభలో వంశీ రామరాజు మాట్లాడుతూ.. వైవిధ్య కార్యక్రమాలకు కళానిలయం సంస్థ గుర్తింపు తెచ్చుకుందన్నారు. పలువురికి విశిష్ట సేవా పురస్కారాలను బహుకరించారు.